క్లుప్తంగా

ఆస్పత్రికి వైద్య పరికరాల అందజేత

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో గురువారం సేవ్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యవసర వైద్య పరికరాలను ఆస్పత్రికి అందించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. ఆస్పత్రికి సుమారు రూ. 15 లక్షలు విలువ చేసే వైద్య పరికరాలను అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ పరికరాలు అత్యవసర చికిత్సలకు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పుష్పానంద్, నూర్, అమృతంరెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి


వ్యాయామం చేయిస్తున్న అరుణ

ఆర్మూర్ : ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపిస్ట్ అరుణ సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. శిబిరంలో రిసోర్స్‌పర్సన్‌లు కిషన్, సురేశ్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలేఖ్య, ఆపరేటర్ రఘు, మెసెంజర్ రవి, సీజీవీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

నందిపేట్ : మండలంలోని ఐలాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం డాక్టర్ శీను నాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 232 మంది విద్యార్థులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లాలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ సెకండియర్ పరీక్షలు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పరీక్షలకు మొత్తం 1928 మందికి 1875 మంది హాజరు కాగా 53 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సాలూర స్కూల్‌లో సైన్స్ ఫేర్


ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఈవో

బోధన్‌: సాలూర జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సైన్స్ ఫేర్ నిర్వహించారు. సైన్స్ అంశాలకు సంబంధించి వివిధ శాస్త్ర ప్రదర్శనలు రూపొందించి ఆవిష్కరించారు. ఎంఈవో రాజీ మంజూష సైన్స్ ఉపాధ్యాయులతో కలిసి ప్రదర్శనలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్ర సంతోష్‌యాదవ్, జ్యోత్స్న, విజయలక్ష్మి, శోభారాణి, స్వామి, లక్ష్మి, విజయ్ కుమార్, సంగీతరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పట్టభద్రులంతా బీజేపీ వైపే..'

బోధన్‌: తెలంగాణలో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల ఘన విజయం నేపథ్యంలో పట్టభద్రులు, ఉపాధ్యాయులు బీజేపీ వైపే ఉన్నట్లు స్పష్టత ఇచ్చారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి గురువారం అన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు ఉత్తర తెలంగాణలో చరిత్ర సృష్టించిందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తీవ్రంగా కృషి చేస్తుంటే, వారిపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలు తగవని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని అన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాల్సిందే

- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- ప్రతి ఇంటికి చెత్తబుట్టల పంపిణీ


ఆర్మూర్ పట్టణంలో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణ పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా విభాగం పదేళ్ల క్రితం ఇంటింటా చెత్త సేకరణను ప్రారంభించింది. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. అయితే ఈ విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి తడి, పొడి చెత్తను వేరే చేసి ఇవ్వాలని మున్సిపల్ అధికారులు, సిబ్బంది కోరుతూనే ఉన్నారు. ఇందుకు అనుగుణంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించేందుకు పలుమార్లు ప్రతి ఇంటికి చెత్త బుట్టలను అందించారు. అయినా ప్రజల్లో మార్పు రావడం లేదని చెత్త సేకరణ సిబ్బంది వాపోతున్నారు. ఆర్మూర్ మున్సిపల్‌లోని 36 వార్డుల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని నిర్ణయించారు. ఇందుకోసం చెత్త సేకరణకు ఇళ్లకు వెళ్తున్న పారిశుధ్య సిబ్బంది, పర్యవేక్షిస్తున్న సంబంధిత అధికారులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని ప్రజలకు సూచిస్తున్నారు. మున్సిపల్ ప్రత్యేకాధికారి అడిషనల్ కలెక్టర్ అంకిత్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ రాజు పర్యవేక్షణలో పట్టణంలోని 36 వార్డుల ప్రజలకు ప్రతి రోజు చెత్త నిర్వహణపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు.

చెత్త బుట్టల వాడకంపై అవగాహన

రాష్ట్ర ప్రభుత్వం అందించిన మూడు రంగుల బుట్టల వాడకంపై ప్రజలకు మున్సిపల్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఆకుపచ్చ బుట్టలో తడి చెత్త(భోజన అవశేషాలు, కూరగాయల తొక్కలు, ఇతర ఆర్గానిక్ చెత్త), నీలం బుట్టలో పొడి చెత్త(ప్లాస్టిక్, కాగితాలు, గాజు పదార్థాలు), ఎరుపు బుట్టలో హానికర చెత్త(బ్యాటరీలు, మెడిసిన్ ప్యాకెట్లు, ఇతర ప్రమాదకర వ్యర్థాలు) అందించాలని సూచిస్తున్నారు.

అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ

పట్టణంలో ప్రతిరోజు సాయంత్రం ఎస్సై గజానంద్, మహిళా సంఘాలు, ఆర్పీలు, మున్సిపల్ అధికారులు 36 వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ చెత్తను వేరుచేయడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. తడి, పొడి చెత్త వేర్వేరు చేసే సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజలు సహకరించాలి



తడి, పొడి చెత్తపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి. పరిసరాల్లో చెత్తను వేయొద్దు. పరిసరాలు శుభ్రంగా ఉంటే అనారోగ్య సమస్యలు దరిచేరవు. ప్రజలు ఇంట్లో తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి ఇంటింటికి వచ్చే మున్సిపల్ వాహనానికి అందించి సహకరించాలి.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

నిర్మాణాలు త్వరగా ప్రారంభించాలి

- అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్

పెర్కిట్‌: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులు పనులను త్వరగా ప్రారంభించాలని అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్ సూచించారు. ప్రభుత్వ పథకాల అమలుకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామాన్ని అడిషనల్ కలెక్టర్ గురువారం సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 97 మంది లబ్ధిదారులను గుర్తించగా పదిమంది నిర్మాణాలు చేపట్టడానికి ముందుకు వచ్చారు. మార్క్ అవుట్ చేసిన ఆయా నిర్మాణ స్థలాలను పరిశీలించారు. లబ్ధిదారులు నిర్మాణాలను త్వరగా ప్రారంభిస్తే ప్రభుత్వం నుంచి దశలవారిగా నిధులు మంజూరవుతాయన్నారు. ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి నవీన్ కుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్ పరిశీలన

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. ప్రభుత్వం అందించిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని 25శాతం రాయితీ పొందాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రాజు, టీపీవో ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ పట్టణంలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అదనపు కలెక్టర్ అంకిత్ మున్సిపల్ కమిషనర్ రాజుకు సూచించారు. పట్టణంలోని ఒకటవ వార్డును సందర్శించి, అక్కడి నీటి సమస్యల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు తాగునీటి సమస్య కలుగకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీ ఉంటే మరమ్మతులు చేయించాలన్నారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

రుద్రూర్‌: ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బాన్సువాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పొతంగల్ మండలం దోమలెడ్గిలో నూతనంగా నిర్మించిన శ్రీ రుక్మిణి సహిత విఠలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. అఖండ హరినామ సప్తాహం ఏర్పాటు చేశారు. కార్యక్రమాలకు ఎమ్మెల్యే పోచారం హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నాందేవ్ మహరాజ్, హన్మంతు, పుప్పాల శంకర్, శంకర్ పటేల్, గంట్ల విఠల్, దిగంబర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి


సభలో మాట్లాడుతున్న గోదావరి

వర్ని: మహిళలపై జరుగుతున్న దాడులకు, పరువు హత్యలకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోదావరి పిలుపునిచ్చారు. గురువారం మోస్రా మండలం చింతకుంట గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు నామమాత్రంగా మారాయని ఆరోపించారు. నాయకులు నర్సక్క, సునంద, నాగమణి, పద్మ, మల్లేశ్, గంగామణి, రాజమణి, ఇందిరా పాల్గొన్నారు.

మహిళలపై ఆగని అఘాయిత్యాలు

బోధన్‌: మహిళలపై నేరాలు, అఘాయిత్యాలు పెరిగాయని ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు బి నాగమణి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులు, పరువు హత్యలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ మహిళా పోరాట దినోత్సవాన్ని జరుపుకోవాలని తమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చిందని తెలిపారు. గురువారం పట్టణ కేంద్రంలోని మహిళా దినోత్సవ వాల్ పోస్టర్లను సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం సభ్యులు రేహానాబేగం, లక్ష్మి, పద్మ, యాదమ్మ, పోశవ్వ, లత, సుజాత, కమల తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ఆహ్వానం



బాల్కొండ: హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని టీఎస్‌ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్, నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో ఈ నెల 9న నిర్వహించే పద్మశాలి సంఘం మహాసభకు హాజరుకావాలని కోరుతూ సీఎంకు ఆహ్వానపత్రికను అందజేశారు.

సేంద్రియ ఎరువులతో భూసారం పెంపు


కమ్మర్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మారుతి

కమ్మర్‌పల్లి: సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరుగుతుందని ఐకేపీ వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మారుతి అన్నారు. గురువారం కమ్మర్‌పల్లి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రసాయనిక ఎరువులను వాడడం వల్ల ప్రతి ఏటా భూసారం తగ్గిపోతుందని దీంతో రాబోయే మూడు తరాల్లో వ్యవసాయానికి ఉపయోగపడే భూమి ఎక్కడా లేకుండా పోతుందన్నారు. భూసారాన్ని పరిరక్షించుకోవాలంటే కృత్రిమ రసాయన ఎరువుల వాడకాన్ని దశల వారీగా పూర్తిగా తగ్గించాలని సూచించారు. సేంద్రియ ఎరువులను వినియోగించి పండించిన పంట ఉత్పత్తులను తింటే ఆరోగ్యాలు మెరుగుపడతాయని అన్నారు. సేంద్రియ ఎరువులను పూర్తిగా పశువుల పేడ, చెరువుల్లోని నల్లమట్టి, నట్టలతో తయారుచేసిన కంపోస్టు ఎరువులతో కలిపి తయారు చేస్తారన్నారు. సేంద్రియ ఎరువులు రైతులకు అందుబాటులో ఉండడం లేదని గుర్తించి బాల్కొండ మహిళా రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువులను ఉత్పత్తి చేసి, ఉత్పత్తి దారులతో సమన్వయం చేసి ఔత్సాహిక రైతులకు నేరుగా గ్రామానికి సేంద్రియ ఎరువులను డెలివరీ ఇచ్చేలా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా ఫాం ఏపీఎం రవి కుమార్, మండల ఏపీఎం కుంట గంగాధర్, బాల్కొండ మహిళ ఉత్పత్తిదారుల సమాఖ్య చైర్మన్ గంగాలక్ష్మి, డైరెక్టర్ చౌట్‌పల్లి గంగమ్మ, సీసీలు బాలేరావు రవికుమార్, నవీన్ కుమార్, భాగ్యలక్ష్మి, పీరియ, అలేఖ్య స్త్రీనిధి సహాయ మేనేజర్ రేణుక, ఆపరేటర్ అనసూయ, వీవోఏలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

రెంజల్‌: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగభూషణం రెడ్డి పేర్కొన్నారు. గురువారం రెంజల్‌లోని హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో మల్టీ టాయిలెట్ నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వార పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుర్మ శ్రీనివాస్ యాదవ్, ఇందిరారెడ్డి, కార్తీక్‌యాదవ్, సాయి బాబాగౌడ్, పోచయ్య, సగ్గు వెంకట్, శ్రీకాంత్ అబ్బోల్ల, గైని కిరణ్, శరత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత

రుద్రూర్‌: పోగొట్టుకున్న ఏడు సెల్ ఫోన్ల బాధితులకు స్థానిక పీఎస్‌లో ఎస్సై సాయన్న గురువారం అందజేశారు. ఫోన్లు పోయిన వెంటనే బాధితులు పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని కనుగొని బాధితులకు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీలు సాగర్, రాజు తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు


సాలూరలో నినాదాలు చేస్తున్న నాయకులు


బోధన్‌లో..


రుద్రూర్‌లో..

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమరయ్య గెలుపొందడంతో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో బీజేపీ నాయకులు పటాకులు కాల్చి సంబరాలు చేపట్టారు. ఒకొరికొకరు స్వీట్లు తినిపించుకుని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. – సాక్షి నెట్‌వర్క్


కోటగిరిలో..


బాల్కొండలో..


మాక్లూర్‌లో..

ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మ దహనం


రెంజల్ మండలం సాటాపూర్ చౌరస్తాలో ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ ధర్మపురి అర్వింద్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు గురువారం దహనం చేశారు. రెంజల్, బోధన్, ఎడపల్లి మండలాల్లో ఎమ్మెల్యేకు అనుకూలంగా, ఎంపీ అర్వింద్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంపీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే జిల్లా పరిధిలో పర్యటనలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


ఎడపల్లిలో..

నవోదయ స్థల ఎంపికలో బీజేపీ వ్యాఖ్యలు శోచనీయం



వేల్పూర్‌: జిల్లాకు మంజూరైన నవోదయ స్కూల్ స్థలం ఎంపిక విషయంలో ఎంపీ అర్వింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి వ్యాఖ్యలు శోచనీయమని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన వేల్పూర్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో నవోదయస్కూలు స్థాపించడానికి రైల్వేలైను, జాతీయరహదారి దగ్గరగా ఉండేటట్లు 30 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కలెక్టర్‌కు సూచించారన్నారు. దాంతో మూడు, నాలుగుచోట్ల జిల్లా కలెక్టర్ స్థలాలను పరిశీలించారని పేర్కొన్నారు. దీనిని అర్వింద్, దినేశ్‌కులాచారి వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు వేల్పూర్ సొసైటీ వైస్‌చైర్మన్ భైరిరవి, ఏఎంసీ డైరెక్టర్ గొరాయి నరేందర్, రమణ, రాజన్న పాల్గొన్నారు.

అబాకస్‌లో ఉత్తమ ప్రతిభ

నవీపేట: మండల కేంద్రంలోని సాహితీ స్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన అబాకస్ ప్రతిభ టాలెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సునీత గురువారం తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో అశోక్ ప్రశంసాపత్రాలను అందజేశారని ఆమె పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్



డొంకేశ్వర్ : మండలంలోని గంగాసముందర్ గ్రామంలో 35 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం పంచాయతీ కార్యదర్శి మోహన్ ఆధ్వర్యంలో ఐదు ఇళ్లకు మార్కింగ్ వేసి ముగ్గు పోశారు. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి దశల వారీగా నిధులు మంజూరవుతాయని సంబంధిత అధికారులు తెలిపారు.

జలాల్‌పూర్‌లో భూమి పూజ

బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్‌లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవేందర్, నాయకులు మోహన్‌రెడ్డి, రంజిత్, మాజీ సర్పంచ్ జక్క చిన్నగంగారాం, సాయిరాం, రవి, లక్ష్మణ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	రా..రాజా(తెలుగు)-11.40, రాక్షస (తెలుగు)-1.45, సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు(తెలుగు)-4.20. 10.10, నారి(ది ఉమెన్)(తెలుగు)-7.35
స్క్రీన్-2	సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు(తెలుగు)-10.15, సివంగి(తెలుగు)-1.30, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్(తెలుగు)-4.10, 7.20, 10.30
స్క్రీన్-3-	ఛావా(తెలుగు)-10.00, 4.20, కింగ్‌స్టన్(తెలుగు)-1.20,7.40, 10.40
స్క్రీన్-4	ఛావా(తెలుగు)-12.20, 7.00, ఛావా(హిందీ)-3.40, 10.20

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-11.00, 4.40, 7.30, 10.20, అగత్యా(తెలుగు)-1.40
స్క్రీన్-2	అగత్యా(తెలుగు)-11.00, 4.40, మజాకా (తెలుగు) - 1.45, 7.35, 10.30
స్క్రీన్-3	గార్డ్(తెలుగు)-10.50, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్(తెలుగు)-1.40, 7.30, శబ్దం (తెలుగు)-4.40, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-10.05, మజాకా (తెలుగు) - 1.25, టర్న్ ఆఫ్‌ది డ్రాగన్ (తెలుగు)-4.30, 7.40, 10.50
స్క్రీన్-2	సందీప్‌కిషన్ మజాకా(తెలుగు)- 10.00, 4.15, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)- 1.05, ఛావా(హిందీ)-7.20, 10.40
స్క్రీన్-3	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-9.40, ఛావా(హిందీ)-12.50 తండేల్(తెలుగు) - 4.10, 10.20, మజాకా(తెలుగు) - 7.15
స్క్రీన్ -4	ఓయ్(తెలుగు)-10.05, జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-1.30, ఛావా(హిందీ)-4.20, సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)- 7.40, మజాకా(తెలుగు)-10.40
లలితామహల్	తండేల్
దేవి	మజాకా
నటరాజ్	ఛావా(హిందీ)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్డ్	130
		లైవ్	80
స్కిన్‌లెస్	150	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,200	వెండి(కిలో)	1,00,500
22 క్యారెట్స్	81,900		

– నిజామాబాద్ బిజినెస్